## ప్రభుత్వ పథకాల అమలుకు ఉద్యోగులపాత్ర కీలకం

**-తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ వెల్లడి**

**చేవెళ్ళ, జనవరి 7, ప్రభాతవార్త:**

ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలవద్దకు తీసుకుపోవడంలో ఉద్యోగులపాత్ర కీలకమని తెలంగాణరాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం ప్రభాతవార్తతో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ప్రభుత్వం ఉద్యోగులప్రభుత్వంగా పనిచేస్తుందని, రానున్న 5సంవత్సరాలలో సిఎం రేవంత్‌రెడ్డి అనేకమార్పులు తీసుకువచ్చి ఆర్థికంగా అభివృద్ధిచేయడానికి పాటుపడుతున్నారు. ఎన్నికలముందు గట్టిగా ఉండేవాడినని, అధికారంలోకి వచ్చాక కాన్సిట్యూషన్ పదవి అడ్డువస్తుందని, పదవికి మర్యాద ఇవ్వాలి కాబట్టి ఇస్తున్నానన్నారు. గతప్రభుత్వం చేసిన నిర్వాకం వలన సిఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు పడినబాధలు చూసి తట్టుకోలేక ఏడుపు వస్తుందన్నారు. మాజీసిఎం కెసిఆర్‌కు అనేకసార్లు ఫోన్‌లుచేసినా కాని మాజీ పిఎం మన్మోహన్‌సింగ్ సంస్మరణసభకు రావాలనికోరినా కెసిఆర్ మాత్రం రాలేదన్నారు. రాష్ట్రం దుర్గతి పట్టేలా వ్యవహరించారని అన్నారు.

# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణాన్ని రద్దు చేయించండి

**ఆమనగల్లు, జనవరి 7, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం నిర్మించబోతున్న గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో ఉపాధి పొందుతున్న మా భూములు అర్థాంతరంగా కోల్పోవలసి వస్తుందని అమంగల్ మండల సాకిబండ తండా రైతులు మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలుసుకొని వేడుకున్నారు. కల్వకుర్తి నియోజకవర్గం కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు గిరిజన రైతులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యేను కలుసుకొని గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంపై ఆవేదన వ్యక్తం చేశారు. భూములు సాగు చేసుకుని కుటుంబాలను పోషించుకునే మాకు భూములు కోల్పోతే ఉపాధి ఎలా పొందగలమని వాపోయారు. ఇట్టి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు నిర్మాణ జరగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు పాండు, రాజా,రవిరాథోడ్, బాలు, గోపి, నార్యా, జయపాల్, దేవేందర్, మహేష్, మణిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మాస్టర్‌ప్లాన్ రూపొందించడంలో అందరి భాగస్వామ్యం

**-జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:**

వికారాబాద్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్ రూపొందించడంలో అందరి భాగస్వామ్యం ఉండాలని జిల్లా అదనపుకలెక్టర్ సుధీర్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై మున్సిపల్‌పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, ఇంజనీర్‌లు, వార్డు అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా అదనపుకలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ, నూతనంగా రూపొందించబోయే వికారాబాద్ మున్సిపాలిటీ మాస్టర్‌ప్లాన్‌కు అందరిసలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రైతులకు, ప్రజలకు ఎలాంటినష్టం వాటిల్లకుండా మాస్టర్‌ప్లాన్ ఉండాలని ఆయన తెలిపారు. పారిశ్రామిక, స్మశానవాటిక, గృహ అవసరాలకోసం జోన్లను గుర్తించే క్రమంలో ప్రజలకు ఆమోదయోగంగా ఉండాలని ఆయన సూచించారు. మాస్టర్‌ప్లాన్ రూపొందించడంలో భవిష్యత్‌తరాలకు ఎంతగానో ఉపయోగపడేలా చూడాలని ఆయన తెలిపారు. మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి ప్రజల అభిప్రాయాలను తీసుకొని కౌన్సిల్‌లో అందరి ఆమోదంతో ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని ఆయన సూచించారు. మాస్టర్‌ప్లాన్‌లో ఎలాంటి సౌకర్యాలు కావాలో వ్రాతపూర్వకంగా సమర్పించాలని ఆయన తెలిపారు. మాస్టర్‌ప్లాన్‌లో ఎలాంటిపొరపాట్లు, తప్పులుజరగకుండా ఇంటి సామాజిక ఆర్థికసర్వేలో భాగంగా ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని ఆయన సూచించారు. మాస్టర్‌ప్లాన్ రూపొందించడంలో కౌన్సిలర్లు ఇచ్చిన సూచనలు, సలహాలను పరిగణనలోకి తీసుకుంటామని అదనపుకలెక్టర్ తెలిపారు. ఈకార్యక్రమంలో డిటిసిపి అదనపుడైరెక్టర్ రమేష్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, కమిషనర్ జాకీర్ అహ్మద్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## అవినీతి అధికారిని సస్పెండ్ చేయాలి..

**-సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బుస్స చంద్రయ్య డిమాండ్**




తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు

**దుద్యాల్, జనవరి 7, ప్రభాతవార్త:**

దుద్యాలమండల తాసిల్దార్‌గా ఆనందరావు పనిచేసినప్పుడు వారసత్వంగా కుమారునికి దక్కాల్సిన భూమిని వేరొకరికి పట్టాచేసినట్లు ఆరోపించారు. బుస్స చంద్రయ్య మాట్లాడుతూ, గౌరారం గ్రామానికిచెందిన బోయిని సాయన్న పేరుపైగల సర్వేనంబర్ 57/2 విస్తీర్ణం, 1.13గుంటల భూమి కలిగి ఉన్నాడు. సాయన్న మరణాంతరం కుమారుడు బోయిని అశోక్‌కు విరాసత్ చేయవలసిన భూమిని వేరేవ్యక్తి న ుండి డబ్బుతీసుకొని ఆయనపేరుపై చేసినట్లు ఆరోపించారు. సంబంధంలేని వ్యక్తులకు పట్టాచేసి అశోక్‌కు, అతనికుటుంబానికి అన్యాయంచేసిన పరిగి తహసీల్దార్ ఆనంద్‌రావును వెంటనే సస్పెండ్‌చేసి క్రిమినల్‌కేసులు నమోదుచెయ్యాలని సిపిఎం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేసి దుద్యాల్ తాసిల్దార్ కార్యాలయ సిబ్బంది లాలయ్యకు ఫిర్యాదు చేశారు. గతంలో దుద్యాలమండల తాసిల్దార్‌గా పనిచేసిన ఆనందరావు (ప్రస్తుతం పరిగి తాసిల్దార్‌గా పనిచేస్తున్నారు) అవినీతి, అక్రమాలకుపాల్పడి అన్యాయంగా ఒక అమాయకునికి తండ్రి మరణానంతరం తండ్రినుండి వారసత్వంగా రావలసిన భూమి వేరేవ్యక్తికి పట్టాచేయడం చట్టవిరుద్ధం అన్నారు. ఆనంద్‌రావు ఈమండలంలో పనిచేసిన రెండునెలలలో భూసమస్యలపేరుతో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడు. గతసంవత్సరకాలంగా అశోక్ అనేవ్యక్తి తనభూమిని తనకే చేయాలని తాసిల్దార్ కార్యాలయం చుట్టూ, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. ఆనందరావు ప్రస్తుతం పనిచేస్తున్న పరిగిమండలంలో కూడా భూసమస్యలు పరిష్కరిస్తామని మ్యూటేషన్, సక్సేషన్ పేరుతో రైతులనుండి లక్షలరూపాయలు అవినీతికి పాల్పడుతున్నారని ఇప్పటికే పరిగిప్రజలు ఆరోపిస్తున్నారు. ఇలాంటి అధికారులువల్ల ప్రజలకు, సమాజానికి తీరనినష్టం వాటిల్లుతుందన్నారు. అందుకని తక్షణమే తాసిల్దార్ ఆనందరావును సస్పెండ్ చేయాలని డిమాండ్‌చేశారు. లేనియెడల జిల్లావ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బాధితుడు అశోక్, వెంకటయ్య, మైసప్ప, మొగులప్ప, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వపాఠశాలల్లో ఆంగ్లబోధనకు ప్రాధాన్యత కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, జనవరి 7, ప్రభాతవార్త:**

ప్రభుత్వపాఠశాలల్లో ఆంగ్లబోధనకు ప్రాధాన్యత కల్పించాలని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో పాఠశాలల్లో ఆంగ్లాన్ని సులభతరంగా విద్యాబోధన చేయడంపై మండల విద్యాధికారులు, ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి పలుసూచనలు, సలహాలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వపాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచడంతోపాటు సులభతరంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు. ప్రభుత్వపాఠశాలల్లో పేదవిద్యార్థులు ఉంటారని, ఆంగ్లభాషకు ప్రాధాన్యత కల్పిస్తూ విద్యాబోధన చేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో ప్రొజెక్టర్ల ద్వారా ఇంగ్లీష్ సినిమాలు చూపించడం వల్ల ఆంగ్లంలో ప్రావీణ్యత సాధించవచ్చునని కలెక్టర్ తెలిపారు. ఇంగ్లీష్‌లో బోధన చేసేందుకు వీలుగా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు. డిసెంబర్ మాసంలోపు ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థినీవిద్యార్థులకు ఇంగ్లీషులో నైపుణ్యాన్ని పెంపొందించాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, డిఇఓ రేణుకాదేవి, వయోజనవిద్య అధికారి శ్రీనివాస్‌గౌడ్, మైనార్టీ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మహబూబా ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

# శారీరక దారుఢ్యంపై కొరవడుతున్న శ్రద్ధ

**-కనుమరుగైన కసరత్తు**
**-దృఢమైన దేహానికి తిలోదకాలు**



ఎద్దులతో దుక్కి చదును చేస్తున్న రైతు

**నవాబుపేట, జనవరి 7, ప్రభాతవార్త:**

మనుషులు సుఖానికి అలవాటుపడి శారీరక శ్రమను తగ్గించేశారు. తిన్నది అరగక తిప్పలు పడుతున్న వైనం ఆందోళనకు గురిచేస్తోంది. ముఖ్యంగా యువత శరీరానికి ఎలాంటి వత్తిడిని కలుగనివ్వకుండా చూసుకుంటున్నారు. దీంతో దృఢమైన దేహానికి తిలోదకాలు ఇచ్చేశారు. పట్టణాలలో కొందరు జిమ్‌ల్లోకి వెళ్ళి కొంత శారీరక దృఢత్వాన్ని పొందుతున్నారు. అయితే శారీరక దృఢత్వానికి మారుపేరైనా గ్రామీణప్రజలు సహజంగా వారు నిర్వహించే వ్యవసాయ పనులతోనే వారికి శారీరకశ్రమ పుష్కలంగా కలిగేది. ఈనేపథ్యంలో వారు ఎలాంటి కసరత్తు చేయకుండానే దృఢత్వాన్ని పొందేవారు. ప్రస్తుతం వ్యవసాయంలో 90శాతం యంత్రాలు ఉపయోగించడంతో పూర్తిగా శారీరకశ్రమ తగ్గింది. దీంతో ఉక్కు మనుషులుగా భావించే గ్రామీణప్రజలు కూడా తిన్నది అరగక నానా అగచాట్లు పడుతున్న వైనం కొనసాగుతున్నది. గతంలో తెల్లవారకముందే ప్రతిరైతు పొలానికి చేరుకుని వ్యవసాయపనుల్లో లీనమయ్యేవారు. ఉదయమే పశువులవ్యర్థాలను శుభ్రంచేయడం, వాటికి కావాల్సినమేతను కోసి సమకూర్చుకోవడంలాంటి పనులు చేసేవారు దీంతో వారికి కావాల్సిన శారీరకశ్రమ కలిగేది. అది ఆరోగ్యానికి ఔషధంగా ఉపయోగపడేది. భోజనాలు చేసుకుని తిరిగి పొలంపనులను చేయండం రివాజు. ఈనేపథ్యంలో పొద్దంతా వారు ఒళ్ళు హూనం చేసుకోవడంతో సహజంగా శారీకశ్రమ కలిగేది. తిన్న ఆహారం నీళ్ళలా అరిగిపోవడం, మధ్యాహ్నం సహితం భోజనాలుచేసి పనులుచేసేవారు. ప్రతినిత్యం ఇలాంటి శ్రమనుచేసే గ్రామీణప్రజలకు సహజంగా లభించే శ్రమతో దృఢత్వం ఏర్పడి ఆరోగ్యంగా ఉండేవారు. నేడు గ్రామీణప్రజలు శ్రమకు దూరమై ఆనారోగ్యం పాలవుతూ వైద్యులను ఆశ్రయిస్తున్న తీరు కొనసాగుతోంది. నేడు కిరాణా దుకాణానికి వెళ్ళిరావాలన్నా బైకును ఉపయోగిస్తున్నారు. పశువులను పొలానికి తరలించేందుకు బైకుపై వెళుతూ వాటిని పరుగెత్తించే కుసంప్రదాయం కొనసాగుతోంది. నెత్తిన కిలోబరువును కూడా మోయడాన్ని కూడా తలభారంగా భావిస్తున్నారు. నాడు దాదాపుగా 50కిలోల పశువులమేతను, వ్యవసాయ ఉత్పత్తులను ఎంతో అవలీలగామోసేవారు. దీంతో శరీరం పటిష్టంగా మారేది. కిలోమీటర్ల కొలది కాలినడకన పొలాలకు రాకపోకలు సాగించడంతో సహజంగానే వారికి కాళ్ళకు, పూర్తి శరీరానికి శ్రమకలిగి ఆరోగ్యానికి బూస్ట్‌లా ఉపయోగపడి ఆరోగ్యానికి మేలు చేసేది. నేడు గ్రామాల్లో కూడా తిన్నది అరగక అవస్థలు పడుతున్నారు. అసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. మహిళలకు సహితం పనిభారం తగ్గడంతో వారు కూడా శారీరకశ్రమకు దూరమై ఊబకాయం భారంతో అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో ఉదయం లోతైన చేదుడుబావుల నుండి బొక్కెన ద్వారా మంచినీటిని తోడే సమయంలో విపరీతమైన శారీరకశ్రమ కలిగి వారి ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడేది. అదేవిధంగా పొలంపనులుకూడా చేయడం చెమటను చిందించడంతో ఆరోగ్యానికి చెమటచుక్కలు అమృతంలా పనిచేసేవి. ఈనేపథ్యంలో కొందరు నేటికీ పొలంపనులు చేస్తూ శ్రమనే నమ్ముకుని ఆరోగ్యాన్ని కాపాడుకునేవారు లేకపోలేదు. ఏదిఏమైనా శారీరకశ్రమ తగ్గడంతో తిన్నది అరగక అగచాట్లు పడుతున్నవారి సంఖ్య మాత్రం ఆమాంతం పెరిగిపోతున్నది. ఈనేపథ్యంలో ఎంతోమంది అనారోగ్యం పాలవుతున్నారు. ఇది ఆరోగ్యవంతమైనసమాజానికి మచ్చగా మారుతోందని పరిశీలకులు భావిస్తున్నారు.

# నిధులు మావి - పేర్లు మీవా..?

**-అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం**
**-ఇందిరమ్మ ఇళ్ళ పేరుతో కేంద్రం నిధులు వాడుకోవడం తగదు**
**-మహబుబ్‌నగర్ ఎంపి డికె.అరుణ**




విలేకరులతో మాట్లాడుతున్న ఎంపి డికె.అరుణ

**కొడంగల్, జనవరి 7, ప్రభాతవార్త:**

అన్నివర్గాల అభివృద్ధే కేంద్రప్రభుత్వ లక్ష్యమని మహబుబ్‌నగర్ పార్లమెంట్‌సభ్యులు డికె.అరుణ అన్నారు. మంగళవారం వికారాబాద్‌జిల్లా కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించారు. ముందుగా కొడంగల్‌మున్సిపాలిటీలో అమృత్‌భారత్-2 స్కీం కింద కొడంగల్‌లో రూ.4.5కోట్లు, కోస్గీలో రూ.12.5కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు శంకుస్థాపనచేశారు. అనంతరం ఎంపి విలేకరులతో మాట్లాడుతూ పిఎం ఆవాస్ యోజన కింద ఇళ్ళ నిర్మాణానికి నిధులు మంజూరీచేయడం జరుగుతుందన్నారు. కానీ ఇక్కడి రాష్ట్రప్రభుత్వం వాటిని ఇందిరమ్మ ఇళ్ళకు మళ్ళిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లపేరుతో కేంద్రప్రభుత్వ నిధులు వాడుకుంటామంటే ఊరుకునేదిలేదని స్పష్టం చేశారు. పిఎం ఆవాస్ యోజన కింద కేంద్రప్రభుత్వం నిధులు ఇస్తే గ్రామాల్లో ఇళ్ళన్నీ తామే ఇస్తున్నామని బిల్డప్ ఇస్తున్నారని మండిపడ్డారు. కావాలంటే మీపథకం పేరు మార్చండి లేదా మీ తరపున నిధులు మంజూరీచేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ళులేని వారందరు లబ్దిపొందేలా చూడాలని అన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇళ్ళులేని నిరు పేదలేకుండా చూడాలని, అందుకు ముఖ్యమంత్రి కొడంగల్‌నుంచే నాంది పలకాలన్నారు. పాలమూరు పార్లమెంట్ పరిధిలో నారాయణపేట్‌లో ఇదేస్కీమ్‌కి అభివృద్ధిపనులు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ప్రస్తుతం కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం రూ.17కోట్ల నిధులతో పనులు ప్రారంభించుకోవడం సంతోష దాయకమన్నారు. సుజలాం సుఫలాం పథకంలో భాగంగా ప్రతి ఇంటికి తాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. అమృత్‌స్కీమ్‌కింద మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్రం భారీగానిధులు మంజూరీ చేస్తుందని గుర్తుచేశారు. అమృత్‌పథకం-2 కింద మంజూరైన మొత్తం రూ.4.5కోట్లపనులకు శంకుస్థాపన చేయడం హర్షణీయమన్నారు. తాగునీటి పైప్‌లైన్, ట్యాంకులనిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని, కేంద్రంనుంచి మంజూరైన నిధులతోనే గ్రామాల్లో వైకుంఠధామాలు, రైతువేదికలనిర్మాణాలు జరిగాయని గుర్తుచేశారు. సమావేశంలో బిజెపినాయకులు పున్నంచంద్ లాహోటీ, నాగులపల్లి ప్రతాప్‌రెడ్డి, సర్వేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పోస్టల్ స్టాంప్‌లపై అవగాహన ఉండాలి

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




తపాలాశాఖ స్టాంప్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త:**

విద్యార్థులు చిన్నతనం నుండే పోస్టల్ స్టాంప్‌లపై అవగాహన కలిగి ఉండాలని జిల్లాకలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్లబ్ ఫంక్షన్‌హాల్‌లో పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మూడురోజులపాటు జరిగే ప్రత్యేకస్టాంపుల ప్రదర్శన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతిప్రజల్వనం గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, జనవరి 7నుంచి 9వరకు అనంతగిరి ఫెక్స్ పేరిట తపాలాశాఖ ప్రత్యేకస్టాంపుల ప్రదర్శనను నిర్వహిస్తుందని, జిల్లాలో మొట్టమొదటిసారిగా ఫిలాసఫీ ఎగ్జిబిషన్ మూడురోజులపాటు ఏర్పాటుచేయడం జరిగిందని తెలిపారు. వ్యాసరచన పోటీలు, క్విజ్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు నిత్యవిద్యార్థులేనని, తాను నిత్యవిద్యార్థి మాదిరి తెలుగు, కన్నడభాషలు నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నా నని అన్నారు. మొదటగా సంస్కృతం నేర్చుకొన్నాన ని, సికింద్రాబాద్‌డివిజన్‌వారి ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న పోస్టల్‌శాఖవారి అనంతగిరి ఫెక్స్ పేరిట కార్యక్రమంలో ఎన్నోవిషయాలు నేర్పిస్తుందని అన్నారు. తన పదవతరగతిలో ఉన్నప్పుడు మాపెదనాన్న ఇళ్ళు ఖాళీచేసే సమయంలో వారిదగ్గర ఒకపుస్తకం చూసి ఆశ్చర్యపోయా నని, ఆపుస్తకంలో దాదా పు 100స్టాంప్‌లు ఉండటం చూసి ఎన్నోవిషయాలుపై అవగా హన తెచ్చుకోవడానికి 30 నుండి 40 రోజులవరకు సమయం పట్టిందని పేర్కొన్నారు. తనచిన్నతనంలో ఒకసంవత్సరములో రెండుసార్లు పోస్టుకార్డు, స్టాంప్ చూసేవాడినని, ఒకటి రక్షాబంధన్, రెండు దసరా పండుగలకు మాబంధువుల నుండి శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టల్ కార్డ్ వచ్చేవని అన్నారు. అప్పటికి ఇప్పటికి చాలా మార్పులు వచ్చాయన్నారు. విద్యార్థులు అందరు చిన్నతనం నుండే పోస్టల్ స్టాంపులపై పూర్తి అవగాహన కలిగించుకోవాలని, అందరు ఇలాంటి కార్యక్రమాలు వీక్షించి, మీతోటి వారందరికీ తెలిపి ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతగిరిఫెక్స్ లోగో తపాలాశాఖ అధికారులతోకలసి ఆవిష్కరించారు. గత కొంతకాలంనుండి సేకరించి ఏర్పాటుచేసిన ఫిలాసఫీ ఎగ్జిబిషన్‌ను తిలకించారు. కార్యక్రమంలో తపాలశాఖ అధికారులు సుబ్రహ్మణ్యం, ఎం.బి. ప్రసాద్, శ్రీనివాస్, సిబ్బంది, కేశవరెడ్డి, న్యాగీతాంజలి, మోడల్‌స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం

**ఘట్‌కేసర్, జనవరి 7, ప్రభాతవార్త:**

మున్సిపల్ పరిధిలో రూ.6.80 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ తెలిపారు.

ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ పావని అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రజాసమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించి అవసరమైన తీర్మానాలను ఆమోదించారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని ప్రతిపాదించడంతో పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సిసిరోడ్లకు రూ.4.10 కోట్లు, భూగర్భ డ్రైనేజీకి రూ.1.20 కోట్లు, మంచినీటి పైపులైన్‌కు రూ.25 లక్షలు, ఓపెన్‌జిమ్‌కు రూ.22 లక్షలు, సిమెంట్‌రోడ్డు మరమ్మత్తులకు రూ.10 లక్షలు, ఇతర పనులకు రూ.18 లక్షలు, ఏదులాబాద్ రోడ్డు వైన్స్ నుంచి సాయినిఖిత వెంచర్ వరకు రూ.50 లక్షలతో బిటి రోడ్డు వేయాలని నిర్ణయించారు. మొత్తం రూ.6.80 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు కౌన్సిల్ ఏకగ్రీవంగా తీర్మానం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బి.చంద్రశేఖర్, వైస్‌చైర్మన్ పలుగుల మాధవరెడ్డి, మేనేజర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు చందుపట్ల వెంకట్‌రెడ్డి, కొమ్మగోని రమాదేవి, బొక్క సంగీత, బండారి అంజనేయులు, కొమ్మిడి అనురాధ, నస్రీన్‌సుల్తానా, సల్లూరి నాగజ్యోతి, బర్ల శశికళ, కడుపొల్ల మల్లేశ్, మేకల పద్మారావు, బత్తుల నరేశ్‌యాదవ్, బేతాల నర్సింగ్‌రావు, కుతాడి రవీందర్, కోఆప్షన్‌సభ్యులు బొక్క సురేందర్‌రెడ్డి, ఎస్‌కె.శౌకత్‌మియా, పల్లె అరుణ, ఏఈ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు నిధులు మంజూరు చేయండి

**షాద్‌నగర్ రూరల్, ప్రభాతవార్త, జనవరి 7:**

షాద్‌నగర్‌పట్టణంలో నూతనంగా నిర్మితమవుతున్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రితోపాటు కేశంపేటమండలం పిహెచ్‌సికి అదనపునిధులు మంజూరు చేయాలని కోరుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహ్మను కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేశంపేట పిహెచ్‌సికి రూ.22.80లక్షల నిధులు కేటాయిస్తే, 30పడకల ఆసుపత్రి ఉపయోగంలోకి వస్తుందని, షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి రూ.5.31కోట్లు కేటాయించినట్లయితే మార్చురీతో పాటు మాడ్రన్ కిచన్, మెకానికల్ లాండ్రీ, కాంపౌండ్ వాల్, సిసి రోడ్లు, పార్కింగ్‌షెడ్, బయోమెడికల్ వేస్టేజ్, భవననిర్మాణాలు పూర్తవుతాయని ఆయన తెలిపారు. కేశంపేట, షాద్‌నగర్ ఆసుపత్రులు పూర్తిస్థాయిలో ప్రజల్లోకి వినియోగంలోకి వస్తే నియోజకవర్గప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్యేకోరిక మేరకు మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే నిధులు మంజూరుచేస్తామని హామీనిచ్చినట్లు తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

## గుర్తుతెలియని వ్యక్తుల చేత వ్యక్తి హత్య:

**ఆదిభట్ల, జనవరి 7, ప్రభాతవార్త:**

గుర్తుతెలియని వ్యక్తులచే ఓవ్యక్తి హత్య చేయబడిన ఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటుచేసుకుంది. ఆదిభట్ల సిఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం బ్రాహ్మణపల్లి ఎక్స్‌రోడ్ తుర్కయంజాల్‌లోని భువిజ అపార్ట్మెంట్స్ సిరిసంపద హోమ్స్‌లో నివాసం ఉండే అంకుల షణ్ముఖరావు (51) గుర్తుతెలియని వ్యక్తులచే హత్య చేయబడినట్లు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని కంసలి మండలం గొల్లాపురం గ్రామానికి చెందిన అంకుల షణ్ముఖరావు తనభార్య ఉమావతితోకలిసి గత ఆరునెలలుగా నాగంశ్రీనాథ్‌రెడ్డి ఇంట్లో ఒక రూములో కిరాయికి నివాసం ఉంటున్నారు. మంగళవారం ఉదయం 8:10 నిమిషాలకు నాగం జంగారెడ్డి అను వ్యక్తి ఇంటి ఓనర్ అయిన నాగం శ్రీనాథ్‌రెడ్డికి ఫోన్‌చేసి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు షణ్ముఖరావును హత్య చేశారని తెలియజేశారు. షణ్ముఖరావు భార్య ఇంటిముందు భయంతో గడగడలాడుతున్నారని తెలియజేయడంతో వెంటనే అక్కడకు చేరుకొని చూడగా షణ్ముఖరావు ముఖంపై రక్తస్రావంతో చనిపోయాడని నిర్ధారించారు. అతని గదిలో చాప, నేలపై రక్తపుమరకలు, ఇంటి వస్తువులు కూడా చిందరవందరగా ఉండడం గమనించి ఎవరో హత్యచేశారని నిర్ధారించారు. ఇంటి ఓనర్ నాగం శ్రీనాథ్‌రెడ్డి ఆదిభట్ల పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదుచేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బిసి డిక్లరేషన్‌ను అమలు చేయండి : బిజెపి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న నేతలు

**అల్వాల్, జనవరి 7 ప్రభాతవార్త:** కామారెడ్డి బిసి డిక్లరేషన్‌ను తక్షణం కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని కోరుతూ తహసీల్దార్‌కు భారతీయ జనతాపార్టీ నేతలు వినతి పత్రం అందించారు. జిల్లా ఓబిసి మోర్చా నేతలు మంగళవారం అల్వాల్ తహసీల్దార్‌ను కలిసి డిక్లరేషన్‌కు సంబంధించిన అంశంపై చర్చించారు. సీఎం కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి ఉన్నారా లేదా అనే విషయాన్ని స్పష్టం చేయాలని బిసి మోర్చా మాజీ అధ్యక్షుడు దండుగుల వెంకటేష్ కోరారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అంశంపై ఎటువంటి చర్యలు ఇప్పటి వరకు లేక పోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు సుజాత, మల్లిఖార్జున్ యాదవ్, పద్మిని, ప్రకాష్ చౌదరి, ప్రదీప్, అజిత్ సాయి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నాయకులు వెంటనే అరెస్టు చేయాలి

**- ఒబిసి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్**

**అత్తాపూర్ జనవరి7,ప్రభాతవార్త :**

ధర్నా పేరుతో బిజెపి రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నేతలు దాడి చేయడం సిగ్గుచేటు అన్ని ఓబిసి మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటేష్ పేర్కొన్నారు.మంగళవారం ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ...కాంగ్రెస్ నాయకులు బిజెపి రాష్ట్ర కార్యాలయంపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి కార్యకర్తలపై దాడి చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నామని దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేని యెడల బిజెపి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు సిద్ధమవుతుందని హెచ్చరించారు.

## బిజెపి కార్యకర్తలపై దాడిని ఖండించిన బాల్ రెడ్డి

**అత్తాపూర్ జనవరి7,ప్రభాతవార్త :**

రాష్ట్ర బీజేపీ కార్యాలయంపై అక్కడ ఉన్న కార్యకర్తలపై కాంగ్రెస్ గూండగిరిని తీవ్రంగా ఖండిస్తున్నానని బీజేపీ నాయకుడు బొక్క బాల్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరు సమావేశంలో మాట్లాడుతూ..రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేవు అనడానికి ఈ ఘటన ప్రత్యక్ష నిదర్శనం అని అన్నారు.నిన్న మజ్లిస్ పార్టీ ఫేక్ హడావిడి పై తాము నిరసన తెలిపితే తమను అరెస్ట్ చేశారని,ఇప్పుడు కాంగ్రెస్ గూండాలు దాడి చేస్తే పోలీస్ లు అసలు వారిని అరెస్ట్ చేశారా అని ప్రశ్నించారు. పోలీస్ ప్రధాన కార్యాలయం,సెక్రటేరియట్,అసెంబ్లీ లాంటి ప్రాంతాలు కూతవేటు దూరంలో ఉండగా దాడి విషయం పోలీస్ లు ముందే తెలుసుకోలేకపోవడం విచిత్రంగా ఉందన్నారు.దాడి జరిగిన తర్వాత కూడా పోలీస్ లు కేవలం బీజేపీ కార్యకర్తలని భయభ్రాంతులకి గురిచేసే విధంగా ప్రవర్తించడం పోలీస్ వ్యవస్థ కే మాయని మచ్చ అని మండిపడ్డారు. కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసిన దుర్ఘటనలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు గారికి తలపై బలమైన గాయం కావడంతో వారిని హుటాహుటిన నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించడం జరిగిందని బిజెపి కార్యకర్తలపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

## నేడు వివిధ కేసులో పట్టుబడిన వాహనాల వేలం

**-ప్రోహిబిషన్,ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ దేవేందర్ రావు**

**అత్తాపూర్ జనవరి7,ప్రభాతవార్త :**

ప్రోహిబిషన్ ,ఎక్సైజ్ స్టేషన్‌లో నేడు(బుధవారం) ఉదయం 12 గంటలకు గతంలో గంజాయి,మద్యం అక్రమ రవాణా వివిధ కేసులలో పట్టుబడిన వాహనాలు(2 ఆటోలు ,13 టూవెలర్స్ ను వేలం నిర్వహించడం జరుగుతుందని ప్రోహిబిషన్,ఎక్సైజ్ ఇన్స్ పెక్టర్ దేవేందర్ రావు పేర్కొన్నారు.ఆసక్తిగల వారు వేలంలో పాల్గొని వాహనాల పొందగలరని తెలిపారు.

## శంకేశ్వర్‌బజార్‌లో సిసి రోడ్డు ప్రారంభం

**సైదాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్ శంకేశ్వర్‌బజార్‌లో రూ.14.70లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల, కార్పొరేటర్ కొత్తకాపు అరుణలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అన్నారు. కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ డివిజన్‌లోని బస్తీలు, కాలనీలలో మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాముఖ్యతను ఇస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పొన్న దర్శన్, కిషన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### బిజెపి ఆఫీసు ముట్టడికి తరలివెళ్లిన యూత్ కాంగ్రెస్ నేతలు

ఉప్పల్, జనవరి 7 ప్రభాతవార్త : ఎఐసిసి అగ్ర నేత ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి పిలుపు మేరకు చేపట్టిన బిజెపి ఆఫీసు ముట్టడికి ఉప్పల్ నుంచి పలువురు నేతలు తరలివెళ్లారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ..బిజెపి మాజీ ఎంపి రమేష్ బిదురి చేసిన అనుచిత వ్యాఖ్యలపై వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపిని బిజెపి నుంచి సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మల్లాపూర్ అధ్యక్షుడు జయంత్, కాప్రా అధ్యక్షుడు ప్రశాంత్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి సచిన్,బాపిరెడ్డి, వినేష్,పాషా, మహేష్, పలువురు యూత్ కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

### విద్యుత్ సమస్యలను తక్షణం పరిష్కరించండి : కార్పొరేటర్

**అల్వాల్, జనవరి 7 ప్రభాతవార్త:**

విద్యుత్ సమస్యలను అధికారులు తక్షణం పరిష్కరించాలని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. రాజీవ్ వీకర్ సెక్షన్, ఓల్డ్ అల్వాల్ తదితర ప్రాంతాలులో నెలకుని ఉన్న విద్యుత్ వైర్లు, స్తంబాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ప్రజలు నుంచి వచ్చిన ఫిర్యాదులు మేరకు ఆమె ఆయా కాలనీలులో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పట్ల అధికార యంత్రాంగం స్పందించాల్సిన అవసరం ఉందని శాంతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అధికారులు ఎఇ సమ్మయ్య స్థానికులు సాజిద్, ప్రేమ్, యాదగిరి, రహమత్‌ఖాన్, ఆరీఫ్, హరీష్ నవీన్, బాబు తదితరులు పాల్గొన్నారు.

### పరిమళా సోమేశ్వర్ రచనల్లో

### స్త్రీ మానసిక రాజకీయ అస్తిత్వ వాదనలు వినిపిస్తాయి

**చిక్కడపల్లి, జనవరి 7 ప్రభాతవార్త:** లేఖిని రచయిత్రుల వేదిక నిర్వహణలో రచయిత్రి డాక్టర్ పరిమళా సోమేశ్వర్ సంస్మరణ సభ మంగళవారం జరిగింది. లేఖిని అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి అధ్యక్షతన ఈ కార్యక్రమంలో కార్యదర్శులు చెంగల్వల కామేశ్వరి, ఉమా కల్వకోట, నళిని ఎర్రా, సర్వమంగళ గౌరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిమళా సోమేశ్వర్ కుమారుడు డాక్టర్ మనోజ్, ఆమె సాహితీ ప్రయాణం, భార్యగా,తల్లిగా ఆమె క్రమశిక్షణతో పిల్లలని తీర్చిదిద్దిన విధానం ఎంతో ఉద్వేగంతో ప్రసంగించారు. ప్రముఖ రచయిత్రి గంటి భానుమతి, డాక్టర్ దేవేందర్ మారోజు. పరిమళా సోమేశ్వర్ రచనలపైన ప్రసంగించారు. డాక్టర్ దేవేందర్ వారి రచనలలోని మహిళాభ్యుదయం , మానసిక విశ్లేషణ, పాత్రల సృష్టి ఎంతో అద్భుతం అని, పరిమళా సోమేశ్వర్ రచనల్లో స్త్రీ మానసిక, కౌటుంబిక, సాంఘిక, రాజకీయ అస్తిత్వ వాదనలు వినిపిస్తాయని, ఆమె గొప్ప రచయిత్రి అని కొనియాడారు.

## మాదిగలకంటే మాలలు ఎక్కువ లబ్దిపొందారని నిరూపిస్తే "30 లక్షల రివార్డు

**హైదరాబాద్, జనవరి 7,ప్రభాతవార్త:**

తెలంగాణ ఆవిర్భావం నేటి వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎస్సిడిడి, ఎస్సి కార్పొరేషన్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, సాంస్కృతిక రథసారథి సంస్థల్లో అమ్ములు అయిన పథకాలలో మాదిగల కంటే మాలలు ఎక్కువ లబ్ధి పొందారని నిరూపిస్తే " 30 లక్షల రివార్డ్ " అందిస్తాం మాల సంఘాల సవాల్ విసిరాయి. ఈమేరకు మంగళవారం మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్ ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు. దీనికి సమత సైనిక్ గల్ సౌత్ ఇండియా అధ్యక్షులు దిగంబరికామ్లే, ప్రజా గాయకుడు రేంజర్ల రాజేష్ ,ఆర్టీసీ మాల ఉద్యోగుల సంఘం నాయకులు దాసరి లక్ష్మయ్య రాజు వస్తాద్, ఆనపూసల వెంకటేష్‌లతోపాటు వివిధ మాల సంఘాల నాయకులు హాజరై మాట్లాడారు. ఎస్సి వర్గీకరణకు కొంత మంది బిసి నాయకులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని కానీ మాలలను స్మగ్లర్లు అని మాట్లాడడాన్ని తీవ్రంగా తప్పు బట్టారు. అలాగే ఎస్సి వర్గీకరణ కొరకు ఉద్యమం చేసే వారు లేదా మద్దత్తు ఇచ్చే వారు మాలలపైన రకరకాల నిందలు వేస్తూ మాదిగలకు రావాల్సిన వాటాను



30లక్షల రివార్డు చెక్కుతో బత్తుల రాంప్రసాద్, రాజు వస్తాద్, రేంజర్ల రాజేష్ తదితరులు

మాలలు దొబ్బి తిన్నారంటు మాట్లాడుతూ ఉన్నారని అలాంటి గాలి మాటలు బంద్ చేయాలన్నారు. చేతనైతే గత పది సంవత్సరాల నుండి ఇప్పటి వరకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎవ్వరికి ఎక్కువ అందయో పూర్తి వివరాలతో బయటపెట్టాలన్నారు. అంతే కాకుండా భవిష్యత్‌లోనూ మాలలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం ఉద్యోగ విభాగం అధ్యక్షులు చెట్లపల్లి అరుణ్ కుమార్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు రవీందర్, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర యువ నాయకులు చొక్కంపేట ఆంజనేయులు, జిల్లా నాయకులు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### సనాతన ధర్మ స్థాపనకు బ్రహ్మకుమారీస్ నిరంతర కృషి : హైదరాబాద్ జోన్ డైరెక్టర్ కులదీప్

**సోషల్ మీడియా పోస్టులపై కోర్టు తీర్పు హర్షనీయం...**

**గచ్చిబౌలి, జనవరి 7 ప్రభాతవార్త**

సనాతన ధర్మ స్థాపన కోసం బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిరంతరం పాటుపడుతుందని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ జోన్ డైరెక్టర్ కులదీప్ బహెన్ అన్నారు. గతకొన్ని రోజులుగా సోషల్ మీడియాలో బ్రహ్మకుమారీస్ సంస్థకు వ్యతిరేకంగా కొన్ని పోస్టులు వస్తుండడంతో తాము కోర్టును ఆశ్రయించామని, బ్రహ్మకుమారీస్‌కు వ్యతిరేకంగా ఉన్న పోస్టులను ఆన్‌లైన్ నుంచి డిలీట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఈమేరకు గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైకోర్టు మాజీ చీఫ్ జస్టీస్ వి.ఈశ్వరయ్య, హైకోర్టు అడ్వకేటు సిహెచ్.జయక్రిష్ణలతో కలిసి విలేకరుల సమావేశంలో కులదీప్ బహెన్ మాట్లాడారు. గతకొన్ని రోజులుగా బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం మీద తప్పుడు ప్రచారం జరుగుతుందని, సోషల్ మీడియాలో తమ సంస్థ మీద బురదజల్లుతూ పోస్టులు పెడుతున్నారని అన్నారు. ఈ విషయమై తాము రెండు రోజుల క్రితం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించామని, సోషల్ మీడియాలో పెట్టిన తప్పుడు పోస్టులను వెంటనే డిలీట్ చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని అన్నారు. బ్రహ్మకుమారీస్



సమావేశంలో పాల్గొన్న బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు, జస్టీస్ ఈశ్వరయ్య తదితరులు

ఈశ్వరీయ విశ్వవిద్యాలయం హిందూ దేవి,దేవతలను నమ్ముతామని, సనాతన ధర్మాన్ని పరిరక్షించడం కోసం 1936-37లో బ్రహ్మకుమారీస్‌ను స్థాపించినట్లు తెలిపారు. అడ్వకేట్ జయక్రిష్ణ మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ మీద వస్తున్న అసత్య ఆరోపణలపై తాము గతంలనే పోలీసులను ఆశ్రయించామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో డిసెంబరు 12వ తేదీన, తెలంగాణలో డిసెంబరు 25వ తేదీన సైబర్ క్రైమ్‌లో తమ పిర్యాదులపై కొన్ని యూట్యూబ్ ఛానళ్లు, వ్యక్తుల మీద పోలీసులు కేసులు నమోదు చేశారని అన్నారు. ఈ విషయమై తాము కోర్టును ఆశ్రయించగా, నిరాధార ఆరోపణలతో ఆన్‌లైన్‌లో ఉంచిన వీడియోలను డిలీట్ చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు ఉమారాణి, అంజలీ, రజనీ, సరళ తదితరులు పాల్గొన్నారు.

## అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుండి తొలగించాలి : తల్లమల్ల హసేన్

**చిక్కడపల్లి, జనవరి 7 ప్రభాతవార్త:** ఇటీవల పార్లమెంటు సమావేశంలో భారత రాజ్యాంగం 75 సంవత్సరాల కాలంలో రాజ్యాంగం అమలు అభివృద్ధి సంక్షేమం అంశం పైన రెండు రోజుల చర్చా సమయంలో అంబేద్కర్ గురించి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్ పేరు చెప్పడం కంటే దేవుని పేరును పలుమార్లు తెలిస్తే మీరు స్వర్గలోకం పోతారని మాట్లాడిన అంశాన్ని ఈ సభ్య సమాజం మొత్తం కూడా తీవ్రంగా ఖండిస్తుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హసేన్ అన్నారు. దేశ అభివృద్ధి సంక్షేమం కోసం తన జీవితాంతం కృషి చేసిన అంబేద్కర్ను అవమానిస్తూ నిండు సభలో మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుండి తొలగించాలని, వెంటనే క్షమాపణలు తెలపాలి డిమాండ్ చేశారు. తన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోవాలని పూర్వ ప్రభుత్వ న్యాయవాది తల్లమల్ల హసేన్ నాయకత్వంలో సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రివర్యులు తెలంగాణ బిజెపి రాష్ట్ర



వినపత్రం సమర్పించిన దృశ్యం

అధ్యక్షులు శ్రీ జి కిషన్ రెడ్డి కార్యాలయం ఇన్చార్జి ఉమా శంకర్‌కు బిజెపి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొబ్బల భాగ్యరెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు తుర్క నరసింహ గారి సమక్షంలో వినతి పత్రం సమర్పించినారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి దాసరి దేవయ్య రాష్ట్ర అధికార ప్రతినిధి కంచరదాసు, ఆనందరావు జిల్లా నాయకులు జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల నరసయ్య కాసిమల్ల వెంకట నరసయ్య ఇట్టమల్ల బిక్షం పాల్గొన్నారు.

### తెలుగు సాహిత్యాన్ని మరో మలుపు తిప్పిన శ్రీశ్రీ : మధుసూదనాచారి



ప్రసంగిస్తున్న తెలంగాణ శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి

**చిక్కడపల్లి, జనవరి 7 ప్రభాతవార్త:** తెలుగు సాహిత్యంలోకి వెలుగు కిరణంలా ప్రవేశించి, తెలుగువారి నరాల్లో ప్రవహించిన మహాకవి శ్రీశ్రీ అని తెలంగాణ శాసనమండలి ప్రతిపక్షనేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మంగళవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ లోని కళాలలిత కళావేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన ప్రముఖ తెలుగు కవి, విప్లవ కవి, సినీరచయిత శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) యాదిలో కార్యక్రమం జరిగింది. సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ శ్రీశ్రీ సృష్టించిన కవితా ప్రభంజనం ఎందరినో తట్టి లేపిందని అన్నారు అయన రాసిన మహాప్రస్థానం కావ్యం ప్రభావం నుంచి నేటికీ బయటకు వచ్చిన రచయితలు కవులు లేరని అంత బలమైన ముద్ర తెలుగు సాహిత్యం పై అయన కెవితలు వేశాయి అని వివరించారు. కార్యక్రమంలో వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, ప్రముఖ గాయకుడు స్వరకిన్నెర చింతలపూడి త్రినాథ రావు, గాయని గరిమెళ్ళ సీత, గానసభ కమిటీ సభ్యుడు బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనులు నిరాటంకంగా కొనసాగిస్తాం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న పద్మారావుగౌడ్ తదితరులు

**సికింద్రాబాద్, జనవరి 7 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో గత పదేళ్ళ కాలంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను నిరాటంకంగా కొనసాగిస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. సితాఫలమండీ డివిజన్ పరిధిలో మంగళవారం ఆయన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సితాఫలమండీ పరిధిలో కొత్తగా రూ.10 కోట్ల ఖర్చుతో నాలా విస్తరణ పనులకు ఆమోదం లభించిందని తెలిపారు. మహమ్మద్ గూడా వద్ద సివరేజ్ సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన ఏర్పాట్లు జరపాలని పద్మారావు గౌడ్ ఆదేశించారు. ఈ సందర్భంగా మహమ్మద్‌గుడాలో రూ.8 లక్షల ఖర్చుతో సివరేజ్ లైన్ ఏర్పాటు పనులను, ఇందిరానగర్ కాలనీలో రూ.18 లక్షల ఖర్చుతో సీ.సీ. రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ సామల హేమ తో కలిసి ప్రారంభించారు. కార్పొరేటర్ సామల హేమ మాట్లాడుతూ సితాఫలమండీ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. అధికారులు విద్యా సాగర్, నవ్య, స్వర్ణ లత, కౌశిక్, నాయకులు కరాటే రాజు, మహమ్మద్ గూడా, ఇందిరానగర్ సంక్షేమ సంఘాల నేతలు, బీ.ఆర్.ఎస్. నాయకులు పాల్గొన్నారు.

## తెలుగు వర్సిటీకి ఎక్స్‌లెన్స్ అవార్డు..



అవార్డు అందుకుంటున్న వెలుదండ నిత్యానందరావు

**నిజాంపేట్, జనవరి 7, ప్రభాతవార్త**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణాలోని అన్ని విశ్వవిద్యాలయాల కన్నా విభిన్నమైనది. తెలుగు భాష, సాహిత్యం, లలిత కళారంగాల విశ్వవిద్యాలయంగా గుర్తింపబడి విద్యారంగంలో ఎక్స్ లెన్స్ పురస్కారాన్ని పొందింది. మంగళవారం నోవాటెల్ హోటల్ లో హైబిజ్ టీవీ వారు నిర్వహించిన ఎడ్యుకేషన్ ఎక్స్ లెన్స్ అవార్డు 2024 ప్రధానోత్సవ కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన శాంతా బయోటెక్ అధినేత డా.వర ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు పురస్కారాన్ని అందుకొని ప్రసంగిస్తూ.. సంప్రదాయ విశ్వవిద్యాలయంగా తెలుగు విశ్వవిద్యాలయం తెలుగు భాష, సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయాలనే కృతనిశ్చయంగా పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలోని విద్యారంగ నిపుణులు సలహాలతో ప్రణాళికలను రూపొందించుకొని మరింత కృషి చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య హనుమంతరావు, మల్లారెడ్డి, విద్యాపీఠ్ వైస్ చైర్పర్సన్ డా.సిహెచ్. ప్రీతిరెడ్డి, మాజీ పార్లమెంట్ సభ్యులు డా. బూర నర్సయ్యగౌడ్, నగరంలోని ప్రముఖ విద్యారంగ నిపుణులు పాల్గొన్నారు.

### రైళ్లపై రాళ్లు విసరడం నేరం : డిప్యూటీ మేయర్



**తార్నాక, జనవరి 7 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ రైల్వే రక్షణ దళం ( ఆర్‌పిఎఫ్) ఆధ్వర్యంలో మంగళవారం లాలాపేట్ రైల్వే బ్రిడ్జి వద్ద ఆపరేషన్ సమ్రక్ష పేరుతో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైళ్లపై రాళ్ల దాడులు, ట్రాక్ పై నుంచి దాటే సమయంలో జరుగుతున్న ప్రమాదల గురించి స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, టిటియుసి రాష్ట్ర అధ్యక్షుడు మోతే శోభన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులను, ప్రజలు రైళ్లు నడుస్తున్న సమయంలో ఎక్కడ, దిగడం ప్రమాదకరమన్నారు.రైల్వే ట్రాక్‌లపై దాటడం ఎంతో ప్రమాదమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో లేదా రైల్వే భద్రతా సమస్యల కోసం 139 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించవచ్చని వివరించారు.ఈ సందర్భంగా ప్రయాణికులందరు భద్రంగా ప్రయాణం చేయడం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌పిఎఫ్ ఇన్స్ పెక్టర్ బీఎస్. సరస్వత్, ఎస్సై. ఎం.వెంకట రెడ్డితో పాటు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నవయస్సుల్లోనే విచిత్రాలు

**-చిత్రాలు అమ్మి.. అనాథశ్రమానికి దానం..**

**-యువతరానికి ఆదర్శంగా నిలుస్తున్న కృష్ణకౌశిక్**

**శేరిలింగంపల్లి, జనవరి 7 ప్రభాతవార్త**

కళ కాసుల కోసం కాకుండా కళకోసమో.. సమాజ హితం కోసమో కొనసాగిస్తే అది ఆదర్శవంతమవుతుంది. ఆ కళాకారుడు పదిమందికి ఆదర్శవంతుడవుతాడు. అచ్చం అదే కోవకు చెందిన చిత్రకారుడుగా కృష్ణకౌశిక్ నిలిచారు. చిన్నతనం నుంచే అనేక గొప్పగొప్ప కళాఖండాలను చిత్రీకరిస్తూ ఆ విద్యార్థి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు.సమాజంలో పెరుగుతున్న టెక్నాలజీని సైతం కళల రూపంలో వాల్ ఆర్ట్‌గా రూపొందిస్తున్నాడు. తాజాగా ఓ సినిమాలో హీరో తగ్గేదేలేదు అంటూ చెప్పిన డైలాగు అచ్చం ఈ 14 ఏళ్ల బాలుడికి చెల్లుతుందేమోని అతని ఆలోచనల ప్రకారం ఇట్టే అర్థమవుతుంది. పూర్తి వివరాలలోనికి వెళితే.. గచ్చిబౌలి ప్రాంతంలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో చదువుతున్న నడుపల్లి కృష్ణ కౌశిక్ చిన్నతనం నుంచే డ్యాన్స్ లోనూ, మంచి చిత్రాలను డ్రాయింగ్ రూపంలో వేయటంలోనూ తనకు సాటిలేదని అందరిచేత మన్ననలను పొందుతునా న్నడు. ఇదే క్రమంలో పదో తరగతి చదువుతున్న కృష్ణకౌశిక్ ఒక మంచి ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. తాను కమ్యూనిటీ ప్రాజెక్టు చేపట్టాలనే లక్ష్యంతో ఆనాథ పిల్లలకు వివిధ రకాల కళలకు సంబందించిన శిక్షణ ఇచ్చేందుకు సంకల్పించుకున్నాడు. ఇదే తరుణంగా ముందుకు అడుగులు వేస్తూ తనలో ఉన్న నైపుణ్యాన్ని స్థానిక చందానగర్‌లోని తపస్వీ ఫౌండేషన్ వారి ఆనాధ శరణాలయంలోని చిన్నారులతో కలిసి వారు నైపుణ్యాలు నేర్చుకునే విధంగా స్వల్ప విధానాల్లో కళాకృతులను నేర్పిస్తున్నారు.ఈ విధంగా కళాకృతులు నేర్చుకున్న వారు వేరొకరిపై ఆధారపడకుండా స్వతంత్రంగా సాగేందుకు తోడ్పాటు ఇచ్చినట్లు అవుతందుని కౌశిక్ చెబుతున్నారు. ప్రస్తుతం తాను గీసిన చిత్రాలను విక్రయించి ఆనాధాశ్రమానికి విరాళంగా ఇవ్వనున్నట్లు తల్లితండ్రులు సాయికృష్ణ,శ్రీదేశిలు పేర్కొన్నారు. కౌశిక్ చదువుతున్న పాఠశాలలో సైతం ఈ అంశాన్ని అందరూ తెలుసుకుని హ్యాట్యాఫ్ కౌశిక్ అంటూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఆనాధబాలలకు చిత్రాలు నేర్పిస్తున్న కౌశిక్

### ఐక్యతతోనే నాయిబ్రాహ్మణుల పురోభివృద్ధి

**-రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు అడిషనల్ కమిషనర్ సిఎల్ఎన్.గాంధీ**

**నాంపల్లి, జనవరి 7 ప్రభాతవార్త :** నాయిబ్రాహ్మణులు ఐక్యమత్యంతో ఉంటూ తమ సత్తా చాటుకుంటేనే వారి హక్కులు సాధించుకొని తదనుగుణంగా పురోభివృద్ధి సాధించగలరని తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు అడిషనల్ కమిషనర్ సిఎల్ఎన్.గాంధీ అన్నారు. నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో మంగళవారం జరిగిన తెలంగాణ రాష్ట్ర నాయిబ్రాహ్మణ సంఘం నూతన సంవత్సరం 2025 క్యాలెండరు ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గాంధీ సంఘ రాష్ట్రాధ్యక్షుడు దేవరకొండ నాగరాజు, పారిశ్రామికవేత్త ఎల్.రాంబాబు తదితర నాయకులతో కలిసి క్యాలెండరును ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు మూల సుధాకర్, ప్రధాన కార్యదర్శి కె.యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వర్, కె.శ్రీనివాస్, రాష్ట్ర సహాయకార్యదర్శి రామచందర్, హరినాథ్, జయప్రభు, ఎస్.లక్ష్మీనారాయణ, నగేష్, గురప్ప, భూపాల్ రాజ్, మాధవి శ్యాంకుమార్‌లతోపాటు వివిధ వార్డుల అధ్యక్ష కార్యదర్శులు పెద్దసంఖ్యలో నాయిబ్రాహ్మణులు పాల్గొన్నారు.

### కళ్లకుకట్టిన హరవిలాసం కూచిపూడి నృత్యరూపకం



హరవిలాసం కూచిపూడి నృత్యరూపకంలో దృశ్యం

**రవీంద్రభారతి, జనవరి 7 ప్రభాతవార్త :**

ప్రముఖ కూచిపూడి నృత్యపాఠశాల అభినయవాణి నృత్యనికేతన్ వారి డా. వెంపటి చిన్నసత్యం నృత్యనాటకాల ఉత్సవం వెంపటి నాట్యమేధలో భాగంగా బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో గురువు చావలి బాలాత్రిపురసుందరి దర్శకత్వంలో దక్షయజ్ఞం, పార్వతీ కళ్యాణం కథాంశాలను కళ్లకుకడుతూ ప్రదర్శించిన హరవిలాసం కూచిపూడి నృత్యరూపకం అత్యంత అద్భుతంగా ప్రదర్శింపబడి ఆహుతులను ఆధ్యాత్మికలోకంలో విహరింపజేసింది. గురువు బాలాత్రిపురసుందరి నట్టువాంగం, డిఎస్‌వి.శాస్త్రి, మృధురవళిల గాత్రం, కె.రాజగోపాలాచార్య మృదంగం, ఆర్.దినకర్ వయోలిన్, విబిఎస్.మురళి వేణువు, కె.శశిధర్ వీణ. పి.సంగీతరావుల అద్భుత వాద్యసహకారం అందించి ప్రదర్శనను మరింత రక్తికట్టించారు. శివునిగా శివాని, దాక్షాయణిగా శ్రీసౌమ్య, పార్వతిగా వైష్ణవి, దక్షరాజుగా అజయ్‌లు నటనకే జీవంపోశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన ప్రముఖులు మంజుభార్గవి, ప్రముఖ కూచిపూడి నృత్యకారిణి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డా. తడకమళ్ల అనురాధ తదితరులు పాల్గొని కళాకారులను, నాట్యగురువు ఎంతగానో అభినందించి ఘనంగా సత్కరించారు.

### గుర్తు తెలియని వ్యక్తి చేతిలో మహిళ దారుణ హత్య

**నార్సింగి, జనవరి 7 ప్రభాతవార్త :** గుడిసెలో నిద్రిస్తున్న మహిళను గుర్తు తెలియని వ్యక్తి దారుణంగా హతమార్చాడు. ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్స్పెక్టర్ జి.హరికృష్ణారెడ్డి కథనం ప్రకారం... వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ ప్రాంతానికి చెందిన మొగులమ్మ అలియాస్ మౌనిక(35-40) 15.రోజుల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చింది. గండిపేట మండలం హైదర్షాకోట్ గ్రామం నర్సారెడ్డి కాలనీలో ఓ గుడిసెలో నివసిస్తూ దినసరి కూలీగా పని చేస్తుంది. ఈ నెల 7.వ,తేదీన ఉదయం పక్కింటి వాళ్లు ఎంత పిలిచినా గుడిసెలో నుంచి ఎలాంటి స్పందన రాలేదు. అనుమానం వచ్చి గుడిసె తలుపు తీసి చూడగా విగత జీవిగా పడి ఉంది. వెంటనే 100కు ఫోన్‌చేసి సమాచారం అందించారు. నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి గుడిసెలోని మహిళ మృతదేహంను పరిశీలించారు. మౌనిక మెడకు టవాల్‌తో ఉరి బిగించి దారుణంగా హతమార్చారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం వచ్చి మృతదేహం వద్ద ఆధారాలు సేకరించారు. గుడిసె పక్కనే ఉన్న ఇంటి వద్ద అమర్చిన సిసి కెమెరాలను పరిశీలించగా అందులో ఓ వ్యక్తి గుడిసెలోకి వెళ్లినట్లు కనిపించింది. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్పెక్టర్ హరికృష్ణారెడ్డి వివరించారు. మహిళ వద్ద ఉన్న ఫోన్‌కు చివరి సారిగా ఎవరెవరు ఫోన్ చేశారో? కాల్ లిస్ట్ తీసి దాని ఆధారంగా కేసును దర్యాప్తు జరిపించి, వీలైనంత త్వరగా హంతకుడిని పట్టుకుంటామని వివరించారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు..

**జీడిమెట్ల, జనవరి 7, ప్రభాతవార్త**

నేడు బౌరంపేట్ సబ్ స్టేషన్ నుండి 11కేవీ కేవీఆర్ ఫీడర్ నేడు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కేవీఆర్ కాలనీ, స్ప్రింగ్‌వుడ్, జేఎన్ఎస్ విల్లాస్, స్టెల్లింగ్ హోమ్స్, ప్రణీత్ నేచర్ బౌంటీ, 11కేవీ బౌరంపేట్ విలేజ్ ఫీడర్లో ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు బౌరంపేట్ విలేజ్, ల్యాండ్ మార్క్ 2, కీర్తి హోమ్స్, అక్షయ్ డెవలపర్స్, బ్లూమ్స్, ప్రణీత్ మెడోస్, అలాగే బొల్లారం సబ్బేషన్ నుండి 11కేవీ మల్లంపేట్ ఫీడర్ ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 3 గంటల వరకు మల్లంపేట్ గ్రామం, హైరైజ్ విల్లాస్, ఏపీఆర్ విల్లాస్. జీవీసీ విల్లాస్. డ్రీమ్ వ్యాలీ కాలనీ, గ్రీన్ పార్క్ కాలనీ, ఆకాష్ లేఅవుట్, మారుతీ నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫర ఉండదని బౌరంపేట్ ఏఈ బి.సాయి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

### రాష్ట్ర స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌కు వెళ్లిన విద్యార్థులు




కార్యక్రమంలో పాల్గొన్న హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి

**చార్మినార్,జనవరి 7 ప్రభాతవార్త :**

రాష్ట్ర స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌కు ఎంపికైన హైదరాబాద్ జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన 30 విద్యార్థులు జడ్జెర్లలో మూడు రోజులు పాటు జరుగుతున్న రాష్ట్ర స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌లో పాల్గొనటానికి వెళ్లారు.ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి మాట్లాడుతూ ఉత్తమ ప్రదర్శన చేసి జాతీయ స్థాయికి వెళ్లాలని అభినందిస్తున్నాని తెలిపారు.కాగా డిసెంబరు నెలలో హైదరాబాద్ నగరంలో జరిగిన జిల్లా స్థాయి ఇన్‌స్పైయిర్‌లో 14 మంది,బాల వైజ్ఞానిక రాజ్య స్థరియా వైజ్ఞానిక ప్రదర్శనలో 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు .జడ్జెర్లలో ఈ నెల9 వ తేదీ వరకు జరుగుతున్న రాష్ట్ర స్థాయి సైన్సు ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు రూపొందించిన పలు రకాల సైన్సు నమూనాలను ప్రదర్శనలో ఏర్పాటు చేయటం జరిగిందని హైరాబాద్ జిల్లా సైన్సు అధికారి ధర్మేందర్ తెలిపారు.

**వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు**

**చార్మినార్,జనవరి 7 ప్రభాతవార్త :** చార్మినార్ సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జనవరి నెల 10వ తేదీన అత్యంత వైభవంగా శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను నిర్వహించనున్నామని దేవాలయం ఆలయం ప్రతినిధి శృంగారం రమణా చార్యులు,అర్చకులు శృంగారం ఆత్రేయ చార్యులు తెలిపారు.శ్రీ వైకుంఠ ఏకాదశి మహోత్సవాలను పురస్కరించుకుని మందిరంలో పలు భక్తి కార్యక్రమాలను నిర్వహించనున్నామని వారు తెలియజేశారు.10వ తేదీ శుక్రవారం వేకువ జామున 3.30 గంటలకు స్వామి వారికి అభిషేకం,4 గంటలకు తోమాల సేవా, 6గంటలకు నేత్ర దర్శనం,6.30 గంటలకు స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం,అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామి పల్లకి ఊరేగింపు తదితర కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.జనవరి 12 వతేదీన నమ్మాళ్ వార్ పరమ పద మహోత్సవం,13న శ్రీ గోదాదేవి కళ్యాణం,15న కరినోము అతి వైభవంగా జరుగుతుందని వారు తెలియజేశారు.

### ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి : శ్రీనివాస్ రెడ్డి




లక్ష్మీనమ గూడ బృందావన్ కాలనీలో పర్యటిస్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాప్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,జనవరి 7 ప్రభాతవార్త :**

మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మీగూడ బృందావన్ కాలనీలో మంగళవారం రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి జిహెచ్ఎంసి,వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరతంరం కృషి చేస్తున్నాని తెలిపారు.పనులలో ఎటువంటి జాప్యం జరగకుండ త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ డిజిఎం రేణుక,మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షులు అడికె జనార్ధన్,బిజెపి నాయకులు హనుమంతరెడ్డి,తలారి చిన్న పాండు,రంజిత్ సింగ్,రాజు,శంకర్ పాల్గొన్నారు.

## సంక్రాంతి ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమని కావ్య కిషన్‌రెడ్డి, చిత్రంలో డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు

**హైదరాబాద్, జనవరి 7 ప్రభాతవార్త**

అంబర్‌పేట మున్సిపల్ మైదానంలో అటల్ బిహారీ వాజ్‌పేయి (ఏబీవీ) ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఏబీవీ ఫౌండేషన్ నిర్వహణలోని 15 సెంటర్లలోని కుట్టు మిషన్ల అల్లికలు, బ్యూటిషన్ తదితర అంశాలలో శిక్షణ పొందుతున్న ఔత్సాహిక మహిళలు ఈ పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో పాల్గొని వేసిన ముగ్గులను ఉద్దేశించి బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.గౌతమ్ రావు మాట్లాడుతూ మహిళలంతా ఒకచోట చేరి ఇలాంటి వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషకరమని, అంతేకాకుండా సంస్కృతిని సంప్రదాయాన్ని ప్రతిబింబించే వేడుక ఈ సంక్రాంతి పండుగ అన్నారు. మహిళలు అర్థకంగా స్వశక్తిగా ఎదిగెలా ఏబీవీ ఫౌండేషన్ ఉపయోగపడుతుందడం సంతోషకరమణి అన్నాడు. ఏబీవీ ఫౌండేషన్ చైర్మన్ కావ్య కిషన్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే మహిళలకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో మహిళల కోసం మరిన్ని శిక్షణ సెంటర్‌లను త్వరలో ప్రారంభిస్తామని అన్నారు. పోటీలలో పాల్గొన్న వారికి గెలుపొందిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, నీరజ తదితరులు పాల్గొన్నారు.

